VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ డిసెంబర్ 21 శనివారం2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 150

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## కేటీఆర్‌పై ఈడీ కేసు

హైదరాబాద్: ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. విదేశీ సంస్థకు నిధులు బదిలీ చేయడంలో అధికార దుర్వినియోగం జరిగిందనే కోణంలో తెలంగాణ అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) దర్యాప్తు చేస్తున్న క్రమంలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రంగంలోకి దిగింది. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు ఇన్ఫర్మేషన్ రిపోర్ట్(ఈసీఐఆర్) నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించింది. మాజీమంత్రి కేటీఆర్‌ను ప్రధాన నిందితుడిగా పేర్కొంది. అలాగే రెవెన్యూ(విపత్తుల నిర్వహణ) విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ పూర్వ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్‌రెడ్డిలను నిందితులుగా చేర్చింది. హైదరాబాద్‌లో ఫార్ములా ఈ-రేస్‌ల నిర్వహణ కోసం యూకేలోని ఫార్ములా-ఈ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థకు నగదు బదిలీ చేయడంలో ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్(ఫెమా), ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్(పీఎంఎల్ఏ) కింద కేసు దర్యాప్తు చేయనుంది. సోమవారం తర్వాత నిందితులకు నోటీసులు జారీచేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. వారి వాంగ్మూలాలను సేకరించాక తదుపరి కార్యాచరణపై దృష్టి సారించనుంది. ఉదయం వివరాల సేకరణ.. సాయంత్రం కేసు నమోదు ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో ఈడీ వేగంగా స్పందించింది.

## తెలంగాణ శాసనసభలో తీవ్ర గందరగోళం

**ఫార్ములా ఈ-రేస్‌పై చర్చించాలని ప్రతిపక్ష భారాస సభ్యులు పట్టుపట్టడం.. భూభారతి బిల్లుపై చర్చ అనంతరం పరిశీలిస్తానని స్పీకర్ చెప్పడం.. సమ్మతించని భారాస సభ్యులు నినాదాలు చేయడం..**





- భూభారతి బిల్లుకు శాసనసభ ఆమోదం
- వాడీవేడి చర్చ అనంతరం సభ తీర్మానం
- ధరణిపై సిబిఐ విచారణకు బిజెపి డిమాండ్
- ప్రతి సమస్యా భూమితో ముడిపడి ఉంది
- భూమికోసం ఎన్నో పోరాటాలు సాగాయి
- ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టేది భూమి
- ధరణితో విదేశీ కంపెనీల చేతికి వివరాలు
- సభలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- బిఆర్ఎస్ సభ్యుల తీరుపై ఆగ్రహం

**'మా గొంతు నొక్కే అధికారం మీకు ఎవరిచ్చారు? తప్పుడు కేసు పెట్టారని కేటీఆర్ భావిస్తే నిరాహార దీక్ష చేయవచ్చు కదా?అలా చేస్తే కనీసం సానుభూతి అయినా వస్తుంది'**

హైదరాబాద్: ఫార్ములా ఈ-రేస్‌పై చర్చించాలని ప్రతిపక్ష భారాస సభ్యులు పట్టుపట్టడం.. భూభారతి బిల్లుపై చర్చ అనంతరం పరిశీలిస్తానని స్పీకర్ చెప్పడం.. సమ్మతించని భారాస సభ్యులు నినాదాలు చేయడం.. మార్షల్స్‌ను నెట్టుకుంటూ పోడియం వైపు దూసుకెళ్లడం, పేపర్లు చించి పోడియంపై విసరడం తదితర పరిణామాలతో శుక్రవారం శాసనసభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. సభలో ఆందోళన చేస్తూనే ఉన్నట్టుండి ఒక్కసారిగా భారాస సభ్యులు హరీశ్‌రావు, వివేకానంద్, కౌశిక్‌రెడ్డి తదితరులు మార్షల్స్‌ను తోసుకుంటూ పోడియం వద్దకు వెళ్లి పెద్దగా నినాదాలు చేశారు. మార్షల్స్ అందరూ వచ్చి వారిని మళ్లీ వెనక్కి నెట్టారు. పోడియం వద్దకు రాకుండా చేతులు పట్టుకొని గంటల తరబడి కాపలా కాశారు. సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో మొదటి రెండు గంటల్లోనే సభను రెండు సార్లు వాయిదా వేశారు. సభ ప్రారంభం కాగానే ఈ-రేస్‌పై చర్చకు పట్టు

శాసనసభ శుక్రవారం మొదలవగానే మంత్రి పొంగులేటి భూభారతి బిల్లుపై చర్చ ప్రారంభించారు. ఫార్ములా ఈ-రేస్‌పై చర్చ జరపాలని, నిజాయతీ, చిత్తశుద్ధి ఉంటే చర్చ చేపట్టాలని హరీశ్‌రావు పట్టుబట్టారు. చర్చకు అవకాశం ఇవ్వాలని ఆయన స్పీకర్‌కు దండం పెడుతూ అభ్యర్థించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ స్పందిస్తూ ప్రభుత్వ బిల్లు ఉందని, ఆ తర్వాత వీలుంటే సమయం ఇస్తామని, తన కార్యాలయానికి వస్తే చర్చిద్దామని చెప్పారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సుకు సంబంధించిన భూభారతి బిల్లుపై చర్చించాలన్నారు. 'మీకు సభా సంప్రదాయాలు తెలుసుకదా.. సభా సమయాన్ని కావాలనే వృథా చేస్తున్నారు.. మీ తీరు వల్ల రాష్ట్రానికి అన్యాయం జరుగుతోంది' అని హరీశ్‌రావును ఉద్దేశించి సభాపతి అన్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భాజపా సభ్యుడు మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతున్నంత

- మిగతా 2వ పేజీలో

### ధరణి అక్రమాలపై సీబీఐ విచారణ

## ఎందుకడగరు?

**భారాస నేతలు దోచుకున్న భూములను బయటపెట్టేదెప్పుడు?**

**సభలో ప్రశ్నించిన భాజపా సభ్యుడు మహేశ్వర్‌రెడ్డి**

**ధరణి అక్రమాలపై సీబీఐ విచారణ ఎందుకడగరు? ధరణి పేరుతో దేశంలోనే అతిపెద్ద కుంభకోణం జరిగిందని, దాని విలువ రూ.2.5 లక్షల కోట్లు ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి చెప్పారని, మరి దీనిపై సీబీఐ విచారణకు ఎందుకు కోరడం లేదని భాజపా సభ్యుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు.**



హైదరాబాద్: ధరణి పేరుతో దేశంలోనే అతిపెద్ద కుంభకోణం జరిగిందని, దాని విలువ రూ. 2.5 లక్షల కోట్లు ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి చెప్పారని, మరి దీనిపై సీబీఐ విచారణకు ఎందుకు కోరడం లేదని భాజపా సభ్యుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. సిటింగ్ జడ్జితోనైనా విచారణ జరిపించాలని, ధరణిలో జరిగిన అవినీతి ఏమిటో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. శాసనసభలో శుక్రవారం భూభారతి బిల్లుపై ఆయన మాట్లాడారు. "కేసీఆర్, కుటుంబ సభ్యులు ధరణి ద్వారా భూములు దోచుకున్నారంటూ 2023 డిసెంబరులో వరంగల్, ఖమ్మం జిల్లాల్లో జరిగిన ఎన్నికల సభల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. వాటిని కక్కించి ఆరు గ్యారంటీలను అమలు చేస్తామనీ అప్పుడు చెప్పారు. అది ఎంతవరకు వచ్చింది? ధరణితో జరిగిన తప్పులను భూభారతి ద్వారా సరిదిద్దుతామన్నారు... అదెప్పుడు పూర్తవుతుందో చెప్పాలి. ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి భూములను రక్షిస్తామని కూడా మీరు చెప్పారు.... అది కూడా ఎప్పుడు పూర్తి చేస్తారో సమాధానం చెప్పాలి. నిషేధిత జాబితాలో ఉన్న పట్టా భూములను వంద రోజుల్లో తొలగిస్తామన్నారు కదా... అదింకా పూర్తికాలేదు. పేదలను బెదిరించి లక్షల ఎకరాలను భారాస నేతలు రాయించుకున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఆ భూముల వివరాలను ఎప్పటిలోపు వెల్లడిస్తారో చెప్పాలి. రాష్ట్ర ఆవిర్భావం నాటికి 24 లక్షలఅసైన్డ్ భూములుండేవి. అవి 5 లక్షలకు ఎలా తగ్గాయో బహిర్గతం చేయాలి" అని మహేశ్వర్‌రెడ్డి డిమాండు చేశారు.



## పార్లమెంట్ నిరవధిక వాయిదా

**గందరగోళం మధ్యే ఉభయసభలు వాయిదా**

న్యూఢిల్లీ: పార్లమెంట్ నిరవధికంగా వాయిదా పడింది. ఉభయసభలు వాయిదా పడ్డాయి. విపక్ష సభ్యుల ఆందోళనతో స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సభను వాయిదా వేసే సమయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కూడా ఉన్నారు.

జమిలి ఎన్నికల ముసాయిదాను జేపీసీకి పంపాలన్న తీర్మానాన్ని ప్రవేశ పెట్టాలని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌ను స్పీకర్ ఓం బిర్లా కోరారు. ఆ బిల్లును ప్రవేశ పెట్టిన తర్వాత జాయింట్ పార్లమెంటరీ కమిటీకి వన్ నేషన్-వన్ ఎలక్షన్ బిల్లును పంపిన తర్వాత సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. ఇక, మరో వైపు విపక్ష ఎంపీల ఆందోళనతో రాజ్యసభను సైతం ఛైర్మన్ జగదీప్ దన్‌ఖడ్ వాయిదా వేశారు.

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో (చితినిబిుస ఞూుబబతినీని) ఉభయ సభల్లోనూ విలువైన సమయం వృథా అయ్యింది. లోక్‌సభ భారీ అంతరాయాలను ఎదుర్కొంది. మూడవ సెషన్‌లో 65 గంటలు, మొత్తం మూడు సెషన్‌లలో కలిపి 70 గంటలకు పైగా సమయాన్ని కోల్పోయింది. నవంబర్ 25న ప్రారంభమైన పార్లమెంటు శీతాకాల సమావేశాలు మూడు విడతలుగా కొనసాగాయి. డిసెంబర్ 19న లోక్‌సభలో గొడవ, ప్రతిపక్ష ఎంపీల నిరసనల నేపథ్యంలో పార్లమెంటు సమావేశాలు ఆకస్మికంగా ముగిశాయి. శుక్రవారం ఉభయ సభలూ నిరవధికంగా వాయిదాపడ్డాయి. మరో వైపు ఈరోజు ఉదయం పార్లమెంట్ ఆవరణలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర.. ఇండియా కూటమి ఎంపీలు నిరసనకు దిగారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ ను అవమానించిన కేంద్రమంత్రి రాజీనామా చేయాలని విజయ్ చౌక్ వద్ద విపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. దీంతో ఇండియా కూటమి సభ్యుల తీరుపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 1,176 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

### స్టాక్ మార్కెట్లలో మరో భారీ పతనం

న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్లలో నష్టాల పర్వం కొనసాగుతోంది. వరుసగా ఐదో రోజు సూచీలు నష్టోయాయి. విదేశీ మదుపరుల అమ్మకాలు, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు మన మార్కెట్లపై ప్రభావం చూపాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1,176 పాయింట్లు నష్టపోయి 78,041కి పడిపోయింది. నిఫ్టీ 364 పాయింట్లు కోల్పోయి 23,587కి దిగజారింది.






## కేటీఆర్‌కు హైకోర్టులో స్వల్ప ఊరట

- ➢ పది రోజుల వరకూ అరెస్టు చేయవద్దని ఆదేశాలు
- ➢ కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు
- ➢ హైకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై విచారణ
- ➢ తదుపరి విచారణను 27కి వాయిదా
- ➢ అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పకుండా ఏసీబీ కేసులా?
- ➢ హైకోర్టులో కేటీఆర్ తరపు లాయర్ల వాదనలు
- ➢ సీజన్ 9 వల్ల దాదాపు రూ.700 కోట్లు లాభం
- ➢ రేసింగ్ ఒప్పందాన్నిఉల్లంఘించిన కొత్త ప్రభుత్వం
- ➢ కొత్త ప్రభుత్వం డబ్బు చెల్లించకపోవడంతో ఒప్పందం రద్దు

2లో..

**ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యానికి కారణాలు చెప్పలేదు సుప్రీం తీర్పుల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యం తగదు ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు ప్రాథమిక విచారణ జరజాలి ప్రజా ప్రతినిధిపై కేసుకు ముందు ప్రాథమిక విచారణ చేయాలి ప్రాథమిక విచారణ అవసరమని సుప్రీంకోర్టు చెప్పింది సుప్రీంకోర్టు తీర్పులను ఏసీబీ అధికారులు పట్టించుకోలేదు ఈ నెల 18న ఫిర్యాదు అందగానే.. 19న ఎఫ్ఐఆర్ నమోదు కేటీఆర్ స్పెక్యులేషన్ చేసినట్లు ఎక్కడా పేర్కొనలేదు. అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పలేదు కానీ, అవినీతి నిరోధక చట్టం కింద కేసు పెట్టారు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సుందరం వాదనలు**

# ధరణి పేరుతో నిరుపేదల ఆస్తులు కొల్లగొట్టారు



ప్రభుత్వ హయాంలో 1 లక్షా 50 వేల కోట్ల విలువ చేసే భూములు చేతులు మారాయని మంత్రి పొంగులేటి ఆరోపించారు. లిటిగేషన్‌లో ఉన్న భూములను పార్ట్-బీ లో పెట్టి ఆ భూములను సక్రమం చేసుకున్నారని దోచిన భూములను బీఆర్ఎస్ నేతలు తమ అస్మదీయులకు విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు చేశారన్నారు. కొన్నిచోట్ల భూములకు యజమానులు ఇక్కడ లేరని .. దేశ విభజన సమయంలో పాకిస్తాన్ వెళ్లిపోయారని, అధికారులు నో అబ్జెక్షన్ అని చెప్పారంటూ ఆ భూములను కూడా కాజేశారని పేర్కొన్నారు. ధరణి వల్ల అక్రమంగా రిజిస్ట్రేషన్ అయిన భూమి ముగ్గరు, నలుగురు వ్యక్తులు మీద మాత్రమే బదలాయింపు అయిందని ఆరోపించారు. ధరణి పేరుతో నిరుపేదల ఆస్తులను కూడా కొల్లగొట్టారన్నారు. అలాగే ధరణి వల్ల సుమారు 25 వేల ఎకరాల అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాని ప్రభుత్వం భావిస్తోంది. ఒక్క ఇబ్రహీంపట్నం పరిధిలోనే 10 వేల ఎకరాలు అన్యాక్రాంతం చేశారని ప్రభుత్వ వర్గాలంటున్నాయి. అక్కడ ఎకరా రూ.10 కోట్ల విలువ ఉంటుందని న్యాక్రాంతమైన 25 వేల ఎకరాల భూముల మొత్తం విలువ రూ.2.50 లక్షల కోట్లుగా అంచనా వేస్తున్నారు. ధరణి మసుగులో జరిగిన భూ ఆక్రమనలన్నీ బయట పెడతామని, దీని వెనకాల ఎంత పెద్దవారున్నా వదిలే ప్రసక్తేలేదని ఇప్పటికే పలు సందర్భాలలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. గత పదేళ్లలో చోటు చేసుకున్న భూ ఆక్రమణల మీద సమగ్ర విచారణ చేయడానికి సిట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అసెంబ్లీలో దీనిపై ప్రకటన చేయలేదు కానీ రేపో మాపో ఉత్తర్వులు జారీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకోకుండా భారాస సభ్యులు వక్రబుద్ధితో వ్యవహరిస్తున్నారని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. 'భారాస సభ్యులు భూ భారతి బిల్లును ఆమోదించకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారి తీరు సభ్యసమాజం సిగ్గుపడేలా ఉంది. సభలో గూండాగిరి, దౌర్జన్యం, రౌడీయిజం లేకుండా స్పీకర్ చర్యలు చేపట్టాలి. భారాస హయాంలో తీసుకొచ్చిన 'ధరణి' పోర్టల్ తప్పులతడకగా ఉందని కేసీఆర్‌కు తెలుసు. ఆయన 80వేల పుస్తకాలు చదివారు. పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించి ధరణి పోర్టల్ రూపొందించారని అనుకునేవాళ్లం. ఆ చట్టానికి మూడేళ్లకే వందేళ్లు నిండాయి. ఇందిరమ్మ రాజ్యంలో 1971లో చేసిన చట్టం.. 49 ఏళ్లుగా ప్రజల్లో ఉంది. భూ భారతి బిల్లుకు సంబంధించి భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అనేక సూచనలు ఇచ్చారు. ఈ బిల్లు సభలో ప్రవేశపెట్టినప్పుడు ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా సూచనలు చేస్తారని ఆశించాం. అవి చట్టంలో పొందుపరచాలని భావించాం. కేసీఆర్ రాలేదు.. సభలో ఉన్నవాళ్లు ఈరకంగా గొడవ చేస్తున్నారు. భారాస చిల్లర వేషాలను ప్రజలు హర్షించరు' అని పొంగులేటి వ్యాఖ్యానించారు. అంతకుముందు హరీశ్‌రావు తీరుపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారాస సభ్యుల ఆందోళన సందర్భంగా స్పీకర్ మాట్లాడారు. 'హరీశ్‌రావు తీరు రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేసేలా ఉంది. సభను తప్పుదోవ పట్టించడం సరికాదు. భూ భారతి ముఖ్యమైన బిల్లు. ప్రజలకు సంబంధించిన బిల్లులపై చర్చల సమయంలో ఇలా ప్రవర్తించడం సరికాదు. ఈ బిల్లు ఇష్టం లేదా? రైతులకు సాయం చేయడం ఇష్టం లేదా?'అని స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఈ కార్ రేస్‌పై ఎప్పుడైనా ఎక్కడైనా చర్చకు సిద్ధం

హైదరాబాద్: తెలంగాణలో ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన నేపథ్యంలో సంచలనం రేకెత్తిస్తోంది. గత 2 రోజులుగా ఈ వ్యవహారం రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా, తెలంగాణ అసెంబ్లీలో ఈ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ వ్యవహారంలో చర్చించేందుకు రావాలన్న కేటీఆర్ సవాల్‌పై స్పందించారు. ఈ కార్ రేస్‌పై సభలో చర్చించాలని కేటీఆర్ ఇంతకాలం ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. 'ఈ కార్ రేస్ ప్రతినిధులు వచ్చి నన్ను కలిశారు. రూ.600 కోట్లు పెండింగ్ నిధులు రావాల్సి ఉంది. ఇవ్వమని అడిగారు. మీరు ఊ.. అంటే మరోసారి రేసింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఎఫ్ఈవో ప్రతినిధులు వచ్చి కలిసిన తర్వాతే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.' అని రేవంత్ వెల్లడించారు. 'హెచ్ఎండీఏ ఖాతాలోని రూ.కోట్ల నిధులు లండన్‌లోని కంపెనీకి నేరుగా ఎలా వెళ్తాయి.?. నిర్వాహకులతో కేటీఆర్ కుదుర్చుకున్న ఒప్పందం విలువ రూ.600 కోట్లు. మిగతా డబ్బు కోసం వాళ్లు వచ్చినప్పుడే ఈ విషయం నా దృష్టికి వచ్చింది. ఓఆర్ఆర్ అమ్మినా.. హెచ్ఎండీఏ నిధులు కాజేసినా.. అడగవద్దన్నట్లు మాట్లాడుతున్నారు. నేను జాగ్రత్త పడడం వల్ల రూ.450 కోట్లు మిగిలాయి. ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై ఏసీబీ విచారణ సాగుతోంది. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ సాగుతోంది కాబట్టి ఎక్కువ వివరాలు వెల్లడించలేను. న్యాయపరంగా చిక్కులు లేకుంటే ఈ వ్యవహారంపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధం. అవసరమైతే బీఆర్ఎస్ కార్యాలయానికి వెళ్లైనా చర్చిస్తాం. రూ.55 కోట్లు చిన్న విషయం కాదు.' అని రేవంత్ పేర్కొన్నారు. కాగా, ఈ ఫార్ములా కార్ రేస్ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలన కలిగిస్తోంది. దీనికి సంబంధించి కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేయగా.. అసలది కేసే కాదని.. ఇది ఓ చిల్లర కేసని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. ఫార్ములా వన్ ఈ కార్ రేస్ వ్యవహారంపై సమాధానం చెప్పేందుకు తాను సిద్ధంగా ఉన్నానని.. అయినా ప్రభుత్వం వెనకడుగు వేస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. 'హైదరాబాద్‌ను ఇన్నోవేషన్, రీసెర్చ్, మ్యానుఫాక్చరింగ్ హబ్ కావాలనే ఉద్దేశంతోనే ఈ కార్ రేస్ నిర్వహించాం. తాము తొలుత ఫార్ములా – 1తో సంప్రదిస్తే వారు రామన్నారు. ఎన్నో తంటాలు పడి ఒప్పించాం. 2023లో ఫిబ్రవరిలో మేము నిర్వహించిన రేస్ చూసి కేంద్ర మంత్రులు, బడా పారిశ్రామిక వేత్తలు సైతం మెచ్చుకున్నారు. రేవంత్ సర్కార్ కుంభకోణం, లంబకోణం అని కేబినెట్‌లో ఏదో సాధించినట్లు లీకులిస్తున్నారు.' అని మండిపడ్డారు.

## భారాస ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు చేయాలి: కాంగ్రెస్ ఎమ్మెల్యేలు




హైదరాబాద్: భారాస ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. స్పీకర్‌ను అవమానించిన వారి సభ్యత్వం రద్దుకు డిమాండ్ చేస్తున్నామన్నారు. దళిత వ్యక్తి సభాపతి అయినందునే ఎమ్మెల్యేలు పేపర్లు చింపి విసిరారన్నారు. వారి ప్రవర్తన దురహంకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. దళితుడైన స్పీకర్‌పై పరుష పదాలతో మాట్లాడారని చెప్పారు. గతంలో సంపత్‌కుమార్ పేపర్ విసిరేస్తే అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. భారాస ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలని స్పీకర్, సీఎంను కోరుతున్నామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తెలిపారు.

అసలేం జరిగిందంటే..

శుక్రవారం తెలంగాణ శాసనసభలో అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. భారాస ఎమ్మెల్యేలు పార్ములా ఈ-రేసుపై చర్చకు పట్టుబట్టారు. అది ఒక వ్యక్తికి సంబంధించిన అంశమని స్పీకర్ తెలిపారు. దీంతో భారాస ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా మార్షల్స్ అడ్డుకున్నారు. ఈక్రమంలో భారాస శాసనసభ్యులు పేపర్లు చించి సభాపతి వైపు విసిరారు. అనంతరం భారాస ఎమ్మెల్యేలు ఉన్న వైపు కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పేపర్లు చించి విసిరారు. వారంతా పరస్పర నినాదాలు, ఆరోపణలు చేసుకున్నారు.

# కేటీఆర్‌కు హైకోర్టులో స్వల్ప ఊరట

**హైదరాబాద్:** తనపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో ఏసీబీ కేసుపై క్వాష్ పిటిషన్ వేశారు. ఈ మేరకు కేటీఆర్ తరపు లాయర్లు జస్టిస్ శ్రవణ్ కుమార్ బెంచ్ ముందు లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. భోజన విరామం తర్వాత పిటిషన్‌ను విచారించాలని కోరారు. ఈ నేపథ్యంలో పై హైకోర్టులో విచారణ జరిగింది. పది రోజుల వరకూ కేటీఆర్ ను అరెస్టు చేయవద్దని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ లోపు కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను 27వ తేదీకి వాయిదా వేసింది. క్వాష్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఇరు వర్గాల న్యాయవాదులు హొరాహొరీగా వాదనలు వినిపించారు. కేటీఆర్ తరపున సుప్రీంకోర్టు లాయర్ సుందరం వాదించారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ లో స్పాన్సర్ వెనక్కి జరిగినప్పుడు... ఈవెంట్ నిర్వహించకపోతే హైదరాబాద్ ఇమేజ్ డ్యామేజ్ అవుతుందనే ఈ నిర్ణయం జరిగిందని కేటీఆర్ తరపు లాయర్ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 18 నాడు ఫిర్యాదు వస్తే 19 నాడు %ఖీ×=% చేశారు... ఎలాంటి ప్రాథమిక దర్యాప్తు చేయకుండా %ఖీ×=% చేశారన్నారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ లో అక్రమాలు జరిగినట్టు ప్రాథమిక దర్యాప్తు లేదని వాదించారు. 2023 అక్టోబర్ లో చేసుకున్న అగ్రిమెంట్ పరకారమే %ఖీజూ% కి చెల్లించారని.. అగ్రిమెంట్ ప్రకారం చెల్లింపులు చేస్తే ఉల్లంఘన ఎలా అవుతుందని కేటీఆర్ తరపు లాయర్ ప్రశ్నించారు. పబ్లిక్ సర్వెంట్ నేర పూరిత దుష్ప్రవర్తన చేస్తే పీసీ యాక్ట్ పెట్టాలి.. కానీ ఫార్ములా ఈ కార్ రేసింగ్ లో క్రిమినల్ మిస్ కాండక్ట్ నేర (పూరిత దుష్ప్రవర్తన) ఎక్కడ జరగలేదు..13(1)%ఖ%, 409 అనే సెక్షన్ లు వర్తించవన్నారు. 2024 లో ఖచ్చితంగా నిర్వహించాలనే ఈ చెల్లింపులు జరిగాయి..కాంగ్రెస్ ప్రభుత్వం %ఖీజూ% కు మిగతా డబ్బులు చెల్లించేందుకు నిరాకరించిందన్నారు. ప్రాథమిక దర్యాప్తు జరపకుండా కేసు రిజిస్టర్ చేయడం చట్ట విరుద్దమనిఅఫెన్స్ జరిగిందని తెలిసాక మూడునెలల లోపే కేసు రిజిస్టర్ చేయాలన్నారు. 11నెలల తర్వాత కేసు నమోదు చేశారు ..లలిత కుమార్ వర్సెస్ యూపీ కేసులో సుప్రీంకోర్టు ఆర్డర్ ఈ కేసులో వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్ రిసింగ్ నిర్వహించడానికి 2022 అక్టోబర్ 25నే ఒప్పందం జరిగిందని.. సీజన్ 9 లో 110 కోట్ల రూపాయల లాభం వచ్చిందని తెలిపారు. సీసన్ 10 కోసం ఓ సంస్థ తప్పుకుంది...దీంతో ప్రభుత్వం ప్రమోటర్ గా ఒప్పందం కుదుర్చుకుందన్నారు. పాత ఒప్పందానికి కొనసాగింపుగా కొత్త ఒప్పందం జరిగిందని.. ఎన్నికల కోడ్ ఉల్లగించారనడానికి ఎలాంటి అధారాలు లేవన్నారు. ప్రొసీజర్ పాటించలేదు అనడం సరైంది కాదన్నారు. ఈ విషయంలో కేటీఆర్ లబ్ది పొందేలదన్నారు. ప్రాథమిక విచారణ జరిగాకే కేసు నమోదైందని అడ్వకేట్ జనరల్ తెలిపారు. రెండు నెలల క్రితం %హీూఖణ% చీఫ్ సెక్రటరీ దాన కిషోర్ ఫిర్యాదు చేశారని.. విచారణకు గవర్నర్ కూడా అనుమతించారని కోర్టుకు తెలిపారు. దానికి సంబంధించిన పేపర్లు ఉన్నాయా అని అడిగిన న్యాయమూర్తి.. ఏజీ ఆ పత్రాలు అందించారు. %ఖీఅతీ% ద్వారానే దర్యాప్తు జరుగుతుందని...ప్రతి విషయం %టఅతీ% లో ఉండదు.దర్యాప్తులో అనేక విషయాలు బహిర్గత మవుతాయన్నారు. దర్యాప్తులో ఈ కేసులో భాగస్వామ్య లైన వాళ్ళ పేర్లు బయటకు వస్తాయని.. విదేశీ కంపెనీకి ప్రజధనం బదిలీ అయ్యింది ఏజీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇది అత్యవసర పిటిషన్ విచారణ కాదన్నారు. కేటీఆర్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సుందరం, ప్రభాకర్‌రావు, గండ్ర మోహన్‌రావు హైకోర్టులో వాదనలు వినిపించారు. ఈ కేసుకు అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు వర్తించవని అన్నారు. 'ఈ కేసుకు ముఖ్యంగా 13(1)(%ఖ%), 409 సెక్షన్లు వర్తించవు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని అనేందుకు ఆధారాలు లేవు. ప్రొసీజర్ పాటించలేదనడం సరికాదు. 14 నెలల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రాథమిక విచారణ లేకుండా కేసు పెట్టారు. ఈ కేసులో ఎన్నో తప్పులు కనిపిస్తున్నాయి. కార్ రేస్ నిర్వహణకు 2022 అక్టోబర్ 25న ఒప్పందం జరిగింది. సీజన్ 10 నిర్వహణకు స్పాన్సర్ వెనక్కు తగ్గారు. రేస్ నిర్వహణలో ఇబ్బందుల నివారణకే ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇబ్బందులు రాకూడదనే హెచ్ఎండీఏ చెల్లింపులు చేసింది.' అని పేర్కొన్నారు. 'సీజన్ 9 వల్ల దాదాపు రూ.700 కోట్లు లాభం వచ్చింది. ఆర్థికశాఖ అనుమతి లేదని ఏసీబీ అధికారులు పేర్కొంటున్నారు. కార్ రేసింగ్ ఒప్పందాన్ని కొత్త ప్రభుత్వం ఉల్లంఘించింది. కొత్త ప్రభుత్వం డబ్బు చెల్లించకపోవడంతో ఒప్పందం రద్దైంది. ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యానికి కారణాలు చెప్పలేదు. సుప్రీం తీర్పుల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యం తగదు. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు ప్రాథమిక విచారణ అవసరమని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయి. వాటిని ఏసీబీ అధికారులు పట్టించుకోలేదు. ప్రజా ప్రతినిధిపై కేసుకు ముందు ప్రాథమిక విచారణ చేయాలి. ఈ నెల 18న ఫిర్యాదు అందగానే.. 19న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేటీఆర్ స్పెక్యులేషన్ చేసినట్లు ఎక్కడా పేర్కొనలేదు.

అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పలేదు. కానీ, అవినీతి నిరోధక చట్టం కింద కేసు పెట్టారు.' అని కేటీఆర్ తరఫు లాయర్ సుందరం వాదించారు.




## యూజీసీ నెట్ పరీక్షల తేదీలు మార్పు

న్యూఢిల్లీ: జూనియర్ రిసెర్చి ఫెలోషిప్ అవార్డు, పీహెచ్‌డీ ప్రవేశాలకు, యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీ పడేందుకు అర్హత సాధించే యూజీపీ నెట్ పరీక్షకు దేశ వ్యాప్తంగా యమ డిమాండ్ ఇంటుంది. అందుకే ప్రతీయేట ఈ పరీక్షను రెండు సార్లు యూజీపీ నిర్వహిస్తుంది. ఈ ఏడాది డిసెంబర్ సెషన్ కు సంబంధించి పరీక్షల తేదీలను ఇప్పటికే యూజీపీ ప్రకటించింది. అయితే ఈ తేదీల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి.. ఈ మేరకు మారిన పరీక్ష తేదీలతోపాటు పరీక్షల షెడ్యూల్‌ను యూజీసీ ప్రకటించింది. దేశ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, జూనియర్ రిసెర్చి ఫెలోషిప్ అవార్డు, పీహెచ్‌డీ ప్రవేశాలకు ఈ పరీక్షలో అర్హత సాధించడం తప్పనిసరి. అందుకే యేటా రెండు సార్లు యూజీసీ నెట్ పరీక్షలు నిర్వహిస్తుంది. తాజా షెడ్యూల్ ప్రకారం జనవరి 3, 6, 7, 8, 9, 10, 15, 16 తేదీల్లో రోజుకు రెండు సెషన్ల చొప్పున పరీక్షలు నిర్వహించనున్నట్లు యూజీసీ వెల్లడించింది. మొత్తం 85 సబ్జెక్టుల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనుంది. కాగా యూజీసీ నెట్ డిసెంబర్ 2024 ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ నవంబర్ 19 నుంచి డిసెంబర్ 10 వరకు కొనసాగిన విషయం తెలిసిందే. త్వరలోనే అడ్మిట్ కార్డులను యూజీసీ విడుదల చేయనుంది. కాగా యూజీసీ- నెట్ పరీక్ష కంప్యూటర్ ఆధారిత విధానంలో జరుగుతుంది. ఈ పరీక్ష మొత్తం రెండు పేపర్లకు ఉంటుంది. రెండు పేపర్లలో ఆబ్జెక్టివ్ టైప్, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు మాత్రమే ఉంటాయి. పేపర్ 1లో 50 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు కేటాయిస్తారు. మొత్తం 100 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది. పేపర్ 2లో 100 ప్రశ్నలు 200 మార్కులకు ఉంటుంది. పరీక్ష 3 గంటల వ్యవధిలో ఉంటుంది. పేపర్-1లో రీజనింగ్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్,

డైరెర్జెంట్ థింకింగ్, జనరల్ అవేర్‌నెస్ వంటి అంశాలపై ప్రశ్నలు వస్తాయి. ఇక పేపర్ 2లో అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్ట్ ఆధారంగా ప్రశ్నలు వస్తాయి. లాంగ్వేజెస్ సబ్జెక్టులు మినహా మిగతా అన్ని సబ్జెక్టుల ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మీడియంలలో మాత్రమే ఉంటుంది.

# తెలంగాణ శాసనసభలో తీవ్ర గందరగోళం

హైదరాబాద్: తెలంగాణ శాసనసభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఫార్ములా ఈ-రేసుపై ఏసీబీ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ భారాస ఎమ్మెల్యేలు చర్చకు పట్టుబట్టారు. ఈ క్రమంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం, తదితర పరిణామాలతో సభలో గందరగోళం ఏర్పడింది. దీంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. ఫార్ములా ఈ-రేసుపై ఏసీబీ కేసు నమోదు చేయడం.. దీనిలో ఏ-1గా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేరును చేర్చడంపై ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభలో నిరసన వ్యక్తం చేశారు. ఫార్ములా ఈ-రేసు అంశంపై చర్చకు పట్టుబట్టారు. దీంతో స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ భూ భారతి బిల్లుపై ప్రభుత్వం చర్చకు సిద్ధమైన నేపథ్యంలో తర్వాత నిర్ణయం తీసుకుందామని భారాస సభ్యులను ఉద్దేశించి చెప్పారు. ఫార్ములా ఈ-రేసు అంశం ఒక వ్యక్తికి సంబంధించినదని.. భూ భారతి బిల్లు రాష్ట్ర ప్రజలకు చెందినదని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు భారాస సభ్యులు యత్నించారు. వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. దీంతో పలువురు భారాస ఎమ్మెల్యేలు పేపర్లు చించి సభాపతి వైపు విసిరారు. అదే సమయంలో కొందరు కాంగ్రెస్ సభ్యులు పేపర్లు చించి భారాస వైపు విసరడంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. అంతకుముందు భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అసెంబ్లీ జరుగుతున్న సమయంలో ఒక ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారు. కేటీఆర్‌ను అప్రతిష్ఠ పాల్జేసి భారాసను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. ఈ అంశంపై రకరకాల లీకులు ఇస్తున్నారు. మేం ఎలాంటి తప్పు చేయలేదు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఫార్ములా ఈ-రేసుపై నిర్ణయం తీసుకున్నాం. మేం తప్పు చేశామంటున్నారు.. దీనిపై సభలో చర్చించి ఆ తప్పేంటో చెప్పాలి. పెట్టింది అక్రమ కేసు కాకుంటే వెంటనే సభలో చర్చించాలి. మేం తప్పు చేయలేదని కేటీఆర్ చెప్పారు. ఈ విషయంలో స్పష్టమైన హామీ ఇస్తే సహకరిస్తాం'అని హరీశ్‌రావు అన్నారు. అయితే స్పీకర్ వారిని వారించినా వినలేదు. భూభారతిపై చర్చకు పల్లా రాజేశ్వర్ రెడ్డికి అవకాశం ఇచ్చినా మాట్లాడలేదు. అనంతరం నినాదాలు చేస్తూ శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. ఫార్ములా ఈ రేసుపై చర్చ జరపాలని బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీలో పట్టుబట్టారు. కానీ ప్రభుత్వం దానికి అనుమతించకపోవడంతో వారు సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ప్రపంచస్థాయిలో తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను పెంచే లక్ష్యంతో హైదరాబాద్ నగరానికి ఫార్ములా ఈ కారు రేసింగ్‌ను కేటీఆర్ తీసుకొస్తే.. ఆయనపై అక్రమ కేసులు పెట్టడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. ఈ అంశంపై చర్చకు పెడితేనే నిజానిజాలు ప్రజలకు తెలుస్తాయని పేర్కొన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఫార్ములా ఈ కారు రేసింగ్‌పై చర్చకు అనుమతించకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. ఈ క్రమంలోనే సభ నుంచి వాకౌట్ చేశారు.

### బిఆర్ఎస్‌ది కచరా గవర్నమెంట్

హైదరాబాద్: ధరణి ఓ కుటుంబం కోసం తెచ్చిందని, దాంతో ప్రజలు ఎలాంటి లబ్ది పొందలేదని ఎంఐఎం సభ్యుడు అక్బరుద్దీన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఫార్ములా ఈ-రేసు అంశంపై చర్చకు భారాస సభ్యులు పట్టుబట్టడంతో పాటు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు యత్నించడంతో సభలో కాసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భారాస సభ్యుల తీరును ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తప్పుబట్టారు. ఈ రోజు సభలో జరిగింది పదేళ్ల భారాస పాలనను తెలియజేస్తోందని వ్యాఖ్యానించారు. సభ్యులు ప్రజల సమస్యలు ప్రస్తావించేందుకు సభకు వస్తారని.. ఇలా ఆందోళన చేసేందుకు కాదన్నారు. పదేళ్ల భారాస పాలన.. కచరా గవర్నెన్స్ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

'ఇవాళ సభలో జరిగింది భారాస సంస్కృతికి నిదర్శనం. భారాస సభ్యులకు కేసీఆర్ బోధించింది ఇదేనా? ధరణి.. ఒక కుటుంబం కోసం.. ఒక పార్టీ కోసమే తెచ్చారు. భూముల ఆడిటింగ్ జరగాలని పదేళ్లుగా డిమాండ్ చేస్తున్నా. నా డిమాండ్‌ను భారాస ఏనాడూ పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా భూముల ఆడిటింగ్ చేయాలి' అని అక్బరుద్దీన్ కోరారు. సభలో చర్చ కొనసాగుతుండగానే భారాస సభ్యులు వాకౌట్ చేశారు. సభలో భారాస సభ్యుల తీరు ఏమాత్రం బాగోలేదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. భారాస నేతలు పదేళ్ల పాటు తెలంగాణ ప్రజల గొంతు నొక్కేశారని మండిపడ్డారు. 'మా గొంతు నొక్కే అధికారం మీకు ఎవరిచ్చారు? తప్పుడు కేసు పెట్టారని కేటీఆర్ భావిస్తే నిరాహార దీక్ష చేయవచ్చు కదా?అలా చేస్తే కనీసం సానుభూతి అయినా వస్తుంది' అని కూనంనేని అన్నారు.

### మెట్రో కోచ్‌ల సంఖ్యను పెంచే యోచనలో ప్రభుత్వం

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు కొద్దికాలంలోనే విశేష ప్రజాదరణ పొందింది. ట్రాఫిక్, కాలుష్య రహితమైన ప్రయాణాన్ని అందిస్తూ విభిన్నవర్గాలకు చేరువైంది. ప్రయాణికులకు మెరుగైన రవాణా అందిస్తూ రికార్డులు క్రియేట్ చేస్తోంది. నిత్యం 5 లక్షల మందికి పైగా ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరవేస్తోంది హైదరాబాద్ మెట్రో. ఏడేళ్లు పూర్తి చేసుకున్న హైదరాబాద్ మెట్రో ఎన్నో మైలురాళ్లను క్రియేట్ చేసింది. ఏడేళ్ల క్రితం భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభమైన హైదరాబాద్ మెట్రో రైలులో ఇప్పటివరకు 63 కోట్ల మందికి పైగా ప్రయాణం చేశారు. సగటున ప్రతిరోజు 4.75 లక్షల మంది మెట్రో ప్రయాణం చేస్తుండగా.. గరిష్టంగా 5.63 లక్షల మంది ప్రయాణికులుగా జర్నీ చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మెట్రో ప్రాజెక్టుల్లో ఢిల్లీ మెట్రో ప్రథమ స్థానంలో ఉంటే.. హైదరాబాద్ మెట్రో మూడోస్థానంలో కొనసాగుతోంది. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టంలో మెట్రో రైళ్లు బ్యాక్ బోన్‌గా ఉంటున్నాయి. ప్రారంభంలో మెట్రో ప్రయాణాలపై అంతగా ఆసక్తి చూపని నగరవాసులు.. ఆ తర్వాత మెల్ల మెల్లగా మెట్రో ప్రయాణం వైపు మ్మొగ్గు చూపారు. ప్రస్తుతం ఎల్బీనగర్-మియాపూర్, నాగోల్-రాయదుర్గం, జేబీఎస్-ఎంజీబీఎస్ మూడు కారిడార్లలో సేవలందిస్తోంది హైదరాబాద్ మెట్రో. ప్రస్తుతం మూడు కారిడార్లలోనూ ప్రయాణికుల రద్దీ ఎక్కువగానే ఉంటోంది. హైదరాబాద్ మహానగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమిస్తూ, వేగంగా ప్రయాణించేందుకు ఎక్కువ శాతం మెట్రోను ఆశ్రయిస్తున్నారు. వీరితోడు ఉద్యోగులు, విద్యార్థులు సైతం ప్రయాణాలకు ఇష్టపడుతున్నారు. దీంతో మెట్రో రైలులో సైతం విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. బిజినెస్ వేళల్లో కనీసం కాలు నిలపలేని పరిస్థితి. ప్రస్తుతం ట్రైన్లలో కూర్చుని ప్రయాణాలు చేసేందుకు ఏమాత్రం అవకాశం దొరకడం లేదు. ఈ క్రమంలోనే మెట్రో కంపార్ట్‌మెంట్ల సంఖ్య పెంచాలని ప్రయాణికులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. మెట్రో ప్రయాణికుల రద్దీపై రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో కోచ్‌ల సంఖ్యను పెంచే యోచనలో ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రో రైల్ 3 కోచ్‌లతో నడుస్తోంది. కావున రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు కోచ్‌లను ఏర్పాటు చేయాలన్న అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మెట్రోను 3 కోచ్‌లతో నడిపేందుకు డిజైన్ చేసినట్లు తెలిపిన మంత్రి.. దాన్ని 6 కోచ్‌లుగా మార్చేందుకు ప్లాన్ చేస్తున్నామన్నారు. త్వరలోనే ఆరు కోచ్‌లుగా అప్‌గ్రేడ్ చేసేందుకు మెట్రో అధికారులు, ఎల్ అండ్ టీ యాజమన్యంతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. కోచ్‌ల పెరిగితే, హైదరాబాద్ మెట్రోలో ప్రయాణికుల రద్దీ తగ్గుతుందని, కూర్చొని ప్రయాణించే వీలు కలుగుతుందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.ఇక మెట్రో సెకండ్ ఫేజ్‌కు కూడా రేవంత్ సర్కార్ సిద్దమవుతున్న సంగతి తెలిసిందే! రెండో దశలో చేపట్టబోయే పనులపై డీపీఆర్ రెడీ అయింది. శంషాబాద్ విమానాశ్రయం వరకు నిర్మించేందుకు ప్రతిపాదించిన మెట్రో మార్గం.. పలు ప్రత్యేకతల సమాహారంగా ఉండబోతోంది. ఎయిర్‌పోర్ట్ కారిడార్‌లో అండర్ గ్రౌండ్ మార్గం నిర్మించేలా ప్రణాళిక రెడీ చేశారు.

## అంబేడ్కర్‌ను అవమానించిందే కాంగ్రెస్

**విజయవాడ:** అంబేడ్కర్‌ను అవమానించిన కాంగ్రెస్ ఇప్పుడు డ్రామాలు అడుతోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. దేశంలో కాంగ్రెస్ చేసినన్ని అరాచకాలు ఇంకెవ్వరూ చేయలేదన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా రాజ్యాంగ బద్ధంగా పార్లమెంట్ సమావేశాలు జరుగుతాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో సమయాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు ఉన్నట్టుండి రాజ్యాంగం, అంబేద్కర్ మీద ప్రేమ పుట్టుకువచ్చిందని విమర్శించారు. శుక్రవారం విజయవాడలో మంత్రి సత్యకుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలో 24వ సవరణ తీసుకువచ్చి ప్రజలకు ఉన్న ప్రాథమిక హక్కులు హరించే విధంగా కాంగ్రెస్ పాలన చేసిందని అన్నారు. రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ భ్రష్టు పట్టించిందని విమర్శించారు. రాజ్యాంగం రచించేటప్పుడు అంబేద్కర్‌ని అవమానపరిచేలా కాంగ్రెస్ పార్టీ కార్టూన్స్‌ని విడుదల చేశారన్ని ÷ర్ అయ్యారు. అంబేద్కర్‌ని నెహ్రూ చాలా విధాలుగా అగౌరవపరిచారన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ని ప్రత్యక్ష ఎన్నికల్లో ఓడించారని చెప్పారు. 'అంబేద్కర్ పోటీ చేసినప్పుడు బీజేపీ అభ్యర్థిని పోటీకి దించకుండా ఆయన్ని బీజేపీ గౌరవించింది. అంబేద్కర్ స్మారకాన్ని నిర్మించటానికి నెహ్రూ అడ్డుపడ్డారు. అంబేద్కర్ సేవలకు భారతరత్న ఇవ్వకుండా నెహ్రూకు మాత్రం ప్రకటించుకున్నారు. అంబేద్కర్ సేవలు గుర్తించి బీజేపీ భారతరత్న ఇచ్చి గౌరవించింది. అంబేద్కర్ నడయాడిన ఐదు ప్రదేశాల్లో పంచ తీర్థ్ కార్యక్రమంతో బీజేపీ శ్రీకారం చుట్టింది. ఏపీలో కూడా కొత్త పిచ్చగాళ్ళు తయారయ్యారు. పలు రాష్టాల్లో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం అయ్యింది. అసత్య ప్రచారాలతో కాంగ్రెస్ మనుగడ కోల్పోతుంది.

కాంగ్రెస్ తప్పు తెలుసుకుని అసత్య ప్రచారాలు చేయటం మానుకుంటే మంచిది. జమిలి ఎన్నికలు ఈ దేశానికి కొత్త కాదు. గతంలో చూసుకుంటే దేశంలో ఒకేసారి ఎన్నికలు జరిగాయి' అని మంత్రి సత్యకుమార్ తెలిపారు. 'వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి 2027లో జమిలి ఎన్నికలు వస్తాయని అని చెప్పి పార్టీ నాయకులని కాపాడుకుంటున్నారు. పార్టీలో నుంచి ముఖ్యమైన నాయకులు బయటకు వెళ్లిపోతున్నారని వారిని కాపాడుకునేందుకు జగన్ 2027లో జమిలి వస్తాయని చెబుతున్నాడు. వైసీపీ పార్టీ ఖాళీ అవ్వకుండా కాపాడుకునేందుకు అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నాడు. జమిలి ఎన్నికలపై కమిటీ వేశారు. కమిటీ అభిప్రాయాల మేరకు ఎప్పుడు జరుగుతాయో తెలియచేస్తారు. పార్లమెంట్‌లో బలం ఉంటే బిల్లు పెట్టాలని రూల్ లేదు. జమిలి ఎన్నికల వల్ల ప్రజాధనం ఆదా అవ్వడంతో పాటు దేశ అభివృద్ధి నిరంతరంగా కొనసాగుతుంది. రాష్టాల్లో ఏదొక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పాలన పరంగా సంక్షేమ పథకాలు అమలు చేయటంలో ఇబ్బందులు ఎదురుకోవాల్సి వస్తుంది' అని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

దళితులను ఉద్దరించిన విధంగా, దళితుల కోసం కాంగ్రెస్ పుట్టినట్లుగా కాంగ్రెస్ నాయకులు వ్యవహారిస్తున్నారని బీజేపీ ఎస్సీ రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్ విమర్శలు చేశారు. అంబేద్కర్ రెండు సార్లు పోటీ చేస్తే కాంగ్రెస్ ఓడించి అనేక విధాలుగా ఇబ్బందులకి గురిచేశారని మండిపడ్డారు. అంబేద్కర్ నడియాడిన ప్రాంతాల్లో బీజేపీ అంబేద్కర్ కోసం చాలా కార్యక్రమాలు చేసిందని దేవానంద్ గుర్తుచేశారు.

# హామీలు మరిపించటానికే తప్పుడు కేసులు

**కేటీఆర్‌పై చిల్లర కేసు.. విచారణలో అన్ని తేలుతాయ్ : జగదీశ్‌రెడ్డి**



**హైదరాబాద్ :** ప్రజలకు ఇచ్చిన హామీలను మరిపించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కేటీఆర్‌పై తప్పుడు కేసు పెట్టిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీష్‌రెడ్డి ఆరోపించారు. తమ నాయకులపై తప్పుడు కేసులు పెట్టేందుకు ఎన్నో ఎంక్వయిరీలు చేయించారని, అయినా కొండను తవ్వి కనీసం ఎలుకను కూడా పట్టలేదని విమర్శించారు. కేటీఆర్‌పై ఒక చిల్లర కేసు పెట్టారని, తప్పు చేసినట్లయితే శాసనసభలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. ఫార్ములా వన్ రేసుపై సమాధానం చెప్పడానికి కేటీఆర్ సిద్ధంగా ఉన్నారని జగదీష్ రెడ్డి చెప్పారు. చర్చ పెట్టకుండా ఎందుకు పారిపోతున్నారని, దమ్ము లేదా..? అని ఆయన ప్రశ్నించారు. రైతు రుణ మాఫీ, మహిళా సమస్యలపై అసెంబ్లీలో చర్చనే లేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం ఏడు లక్షల కోట్ల అప్పు చేసిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అప్పు నాలుగు లక్షల కోట్లేనని ఆర్బీఐ స్పష్టం చేసిందని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఫార్ములా వన్‌పై చర్చ కచ్చితంగా జరగాల్సిందేనని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా వాస్తవాలు ప్రజలకు తెలుసని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో 1.2 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని, దీన్నిబట్టి వాళ్ళ ఐదేళ్లలో ఏడు లక్షల కోట్ల అప్పు చేస్తారని అన్నారు. అసత్యాలతో బీఆర్ఎస్ పార్టీని బయపెట్టలేరని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా, వెధవ వేషాలు వేసినా ప్రజాక్షేత్రంలో, శాసనసభలో నిలదీస్తామని జగదీష్ రెడ్డి అన్నారు. ఫార్ములా వన్‌పై తప్పక అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని, బడే భాయ్, చోటే భాయ్ ఒకే లైన్‌లో ఉన్నారని ఆరోపించారు.

# ఎన్నికల హామీలపై చర్చ జరగాల్సిందే.. : తలసాని శ్రీనివాస్‌యాదవ్



హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో అలవికాని హామీలు ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చడంలో విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. ఆ హామీలపై చర్చ పెట్టాలని తాము కోరామని తెలిపారు. ఇవాళ ఉదయం శాసనసభ సమావేశాల ప్రారంభానికి ముందు మీడియా పాయింట్‌లో తలసాని మాట్లాడారు. ఫార్ములా వన్ రేసు సందర్భంగా అవినీతి జరిగిందంటూ తమ నాయకుడు కేటీఆర్‌పై కేసు పెట్టారని, ఫార్ములా వన్‌పై చర్చ జరగాలని తాము డిమాండ్ చేస్తున్నామని తలసాని వెల్లడించారు. శాసనసభలోతమ దళిత ఎమ్మెల్యేలకు చెప్పులు చూపించారని ఆయన ఆరోపించారు. సభ రికార్డులు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. తాము అన్ని విధాల సభకు సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

# ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఖర్చు కూడా ఒక ఖర్చేనా?

ఎన్నికలనేవి ప్రజాస్వామ్యంలో పండుగ వంటివి. పండగ ఖర్చును చూసి ఎవరూ భయపడరు. ఉన్నవాడు లేని వాడు అంతా తమకు ఉన్న దాంట్లో పండగ చేసుకుంటారు. అలాంటి ప్రజాస్వామ్య పండుగకు ప్రభుత్వం చేసే ఖర్చును బూచీగా చూపించి మోడీ సర్కార్ జమిలీ ఎన్నికలను ముందుకు తెచ్చింది. నిజానికి ఖర్చు మాట పైకి చెబున్నది. లోగుట్టు వేరే. ప్రపంచంలో ఐదవ పెద్ద ఆర్థిక వ్యవస్థలో ఎన్నికల ఖర్చు కూడా ఒక ఖర్చేనా అనిపిస్తుంది సామాన్యుడికి సైతం. ఎన్నికల ఖర్చు ఆదా అంటే.. అది ఎన్నికల నిర్వహణ ఖర్చు ఆదానా లేక రాజకీయ పార్టీలు పెట్టే ఖర్చులు తగ్గించుకునేందుకా! లోక్ సభ ఎన్నికలు ఒక సారి, అసెంబ్లీ ఎన్నికలు ఒక సారి వస్తే.. రెండు సార్లు నేతలు ఓటుకు నోటు ఇవ్వాలి, ప్రచారానికి భారీగా ఖర్చు పెట్టాలి, మందు ముక్క కు ఖర్చు పెట్టాలి.. అదే ఒకేసారి ఎన్నికలు వచ్చేస్తే ఖర్చులో ఖర్చు తగ్గిపోతుంది! అసెంబ్లీ ఎన్నికలకు, లోక్ సభ ఎన్నికలకు రెండు సార్లు నోటు ఇవ్వాల్సిన పని ఉండదు, ఇక ప్రచార ఖర్చు అయితే మరింతగా తగ్గిపోతుంది! బహుశా నేతలకు ఒకేసారి ఖర్చు చేసి ఐదేళ్ల పాటు ఇష్టానుసారం వ్యవహరించుకోవ డానికే ఈ జమిలి ఎన్నికల ఆలోచన కాబోలు! అయితే ఈ మాత్రం ఆలోచన, ఈ మాత్రం జ్ఞానం అమెరికా వంటి దేశానికి ఎందుకు లేదో మరి. అక్కడి ప్రతి నాలుగేళ్లకూ ఒకసారి ఎన్నికలు పెట్టుకున్నారు. శతాబ్దాల నుంచి అలాగే కొనసాగిస్తూ ఉన్నారు! మన దగ్గర ప్రధానికి అవకాశం ఐదేళ్లు, ముఖ్యమంత్రికి అవకాశం ఐదేళ్లు.. అన్ని ప్రజాస్వామ్య బద్ధ పదవులకూ ఐదేళ్ల కాలాన్ని ఇచ్చింది భారతరాజ్యాంగం. అమెరికాలో మరీ నాలుగేళ్లే అవకాశం. ఐదేళ్లతో పోలిస్తే నాలుగేళ్లు ఒక ఏడాది ముందుగానే గడిచిపోతాయి. సర్దుకోవడానికి ఏడాది పడుతుంది, చివరి ఏడాది ఎన్నికల ఏడాది. మధ్యలో మిగిలింది రెండేళ్ల సమయమే.. అయితే ఏ అమెరికన్ ప్రెసిడెంట్ కూడా నాలుగేళ్లు మరీ తక్కువ కాలం, దాన్ని ఐదేళ్లు చేయాలనో, ఆరేళ్లు చేయాలనో వాదించలేదు! అలా తమ పదవీ కాలాన్ని పెంచుకునే ప్రయత్నాలనూ చేయలేదు!



ఎన్నికల ఖర్చు గురించి తెగ బాధపడిపోతూ ఇప్పుడు భారత ప్రభుత్వం ఒక దేశం ఒక ఎన్నికలు అంటూ వాదిస్తూ ఉంది. అయితే ఏదైనా 'ఒకే' అనేది భారత్‌కు వర్తింపచేయటం చాలా కష్టం. అసలు కుదరదు. ఎందుకంటే మనది భిన్నత్వం! భిన్నత్వంలో ఏకత్వమే భారత ప్రజాస్వామ్యానికి ఊపిరి పోస్తూ వచ్చింది. అయితే మరీ ముఖ్యంగా 2014 నుంచి ఒకటే ఒకటే.. అనే మాట బాగా వినిపిస్తూ ఉంది. ఒకటే భాష, ఒకటే మతం, ఒకటే పౌరసత్వం, ఒకటే ఎన్నిక.. ఇలాంటి వాదనలు ముఖ్యమైన పదవుల్లోని వారి నుంచి వినిపిస్తూ ఉన్నాయి. ఒక్కక్కటిగా సాధించుకుంటూ ఉన్నారు! మరి ఇప్పుడు ఒకేసారి ఎన్నికలు జరిగిపోతే ఆ తర్వాత ఐదేళ్లు ఇక ఏం చేసినా అడిగే వారు ఉండరనా! మొన్నటి వరకూ మోడీజీకి చాలా కష్టం ఉండేది. కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలంటే కర్ణాటక చుట్టూ నెల రోజుల పాటు తిరగాలి, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలంటే మహారాష్ట్ర కు తనే సీఎం అభ్యర్థిని అన్నట్టుగా ప్రచారం చేయాలి.. ఇలా దేశంలో ఎక్కడ అసెంబ్లీ ఎన్నికలు వచ్చినా.. ప్రధానిగా కన్నా.. ఆ రాష్ట్రానికి తనే సీఎం క్యాండిడేట్ అన్నట్టుగా మోడీ ప్రచారం చేసి పెట్టే వాళ్లు! మరి ఈ ఇబ్బంది వద్దనే.. ఒక దేశంలో అన్ని రాష్ట్రాలకూ, అన్ని లోక్ సభస్థానాలకూ ఎన్నికలు జరిగేస్తే? ఆ తర్వాత మోడీ కి ఇలా ముఖ్యమంత్రి అభ్యర్థి తరహాలో ప్రచారం చేయాల్సిన అవసరం తప్పుతుంది! ఇక ఆయన ఎంచక్కా ప్రధానిగా తన పనుల్లో మునిగిపోవచ్చు. అలాగే యూపీ అసెంబ్లీ ఎన్నికలంటే పెట్రో ధరలను పెంచకుండా కొన్నాళ్లు ఓపిక పట్టే వారు, ఎన్నికల షెడ్యూల్ వచ్చిన రోజు నుంచి పోలింగ్ ముగిసే రోజు వరకూ ధరల హెచ్చులు ఉండేవి కావు. అలాగే కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలున్నప్పుడు కొన్ని ప్రజాకర్షక పథకాలు ఉండేవి. ఇక వాటి అవసరం కూడా ఉండదు. ఎలాగూ దేశమంతా ఐదేళ్లకు ఒకసారి అన్ని ఎన్నికలూ అయిపోతాయి కాబట్టి? ఇక ఆ రెన్నాళ్లూ ప్రజాకర్షక పథకాలు అమలు చేస్తే చాలు, ఆ తర్వాత ఐదేళ్లూ ఆడింది ఆట, పాడింది పాట! కార్పొరేట్లకు వంత పాడుకోవచ్చు , సామాన్య ప్రజలు మరో ఐదేళ్ల వరకు సైలెంట్‌గా మూలనపడి ఉంటారు.

# కేసులు ఉపసంహరించుకునే వరకూ పోరాడుతాం : మధుసూదనాచారి



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసును ఉపసంహరించుకునే వరకు పోరాడుతామని మండలిలో విపక్ష నేత, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. కేటీఆర్ మీద పెట్టిన అక్రమ కేసు తీవ్రంగా నిరసన తెలుపుతున్నామని, దానిపై సభలో చర్చించాలని డిమాండ్ చేశామన్నారు. హైదరాబాద్ విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారని, కేటీఆర్ తన శక్తి మేరకు ప్రపంచ స్థాయి ఫార్ములా–ఈ రేస్ హైదరాబాద్ తెచ్చారని వెల్లడించారు. శాసనమండలి మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్ కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో విదేశీ పెట్టుబడులు పెట్టేలా ఈ రేస్ చేపట్టారన్నారు. మొదటి రేసు విజయవంతమైందని, రెండో రేసుని ప్రభుత్వం ఆపేసిందని చెప్పారు. హైదరాబాద్‌ను సర్వనాశనం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. అందులో భాగంగానే కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టారని ఆరోపించారు. ఇప్పటికే కేటీఆర్ అన్ని వివరాలు చెప్పారని, ఇందులో ఎలాంటి అవినీతి జరగలేదని స్పష్టం చేశారు. చాలా పారదర్శకంగా చెల్లింపులు జరిగాయని వెల్లడించారు. ప్రభుత్వం తప్పులను ఎత్తి చూపుతునందుకే ఈ అక్రమ కేసు పెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో భయానక వాతావరణం కొనసాగుతున్నదని, అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ బిడ్డలకు పోరాటాలు కొత్తకాదని చెప్పారు. ఎలాంటి కేసులైన ధైర్యంగా ఎదుర్కొంటారని స్పష్టం చేశారు. కేటీఆర్‌ప పెట్టిన కేసు అక్రమమని మాజీ మంత్రి మహమూద్ అలీ అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఈ రేస్ తెచ్చారని తెలిపారు. అనుకున్న దానికంటే ఎక్కువ పెట్టుబడులు వచ్చాయని వెల్లడించారు. హైదరాబాద్ ఇమేజ్ మరింత పెంచేందుకు ఫార్ములా–ఈ రేస్ తెచ్చారని చెప్పారు. కేటీఆర్ మీద కేసులు పెట్టడం కాదని, ఇచ్చిన హామీలు నెరవేర్చాలని రేవంత్ రెడ్డికి సూచించారు.

# లగచర్ల భూ బాధితులు విడుదల.

## - స్వాగతం పలికిన గిరిజన సంఘాలు.

**వేగుచుక్క న్యూస్: సంగారెడ్డి**



కంది జైల్లో రిమాండ్ లో ఉన్న కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్ల గ్రామ పులిచెర్లకుంట తండా, రోటిబండ తండా గ్రామాలకు చెందిన 17 మంది రైతులు శుక్రవారం బెయిలుపై విడుదలయ్యారు. వీరికి గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు రాజేందర్ నాయక్ ఆధ్వర్యంలో పూలమాల వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జైపాల్ నాయక్ మాట్లాడుతూ, కేసుకు, భూములకు ఎలాంటి సంబంధం లేని అమాయక గిరిజనులను తీసుకొచ్చి వారి మీద కేసులు పెట్టి, జైల్లో నిర్బంధించరని అన్నారు. అరెస్టు ముందు పరిగి పోలీస్ స్టేషన్లో కు తీసుకెళ్లి వారి మీద థర్డ్ డిగ్రీ ప్రయోగించడం జరిగిందని బాధితులు తెలిపారని అన్నారు. జీవనోపాధి కోసం సౌదీలో పని చేసుకుంటూ, సెలవుపై గ్రామానికి వచ్చిన పాతోలత్ శీను 1,50,000 చెల్లించి వీసా అప్లై చేసుకున్నాడని, అతనికి ఎటువంటి సంబంధం లేకున్న కేసు పెట్టడం దుర్మార్గపు చర్య అన్నారు. అక్రమ కేసులను కొట్టివేయలని, జైల్లో ఉన్న మిగతా వారికి తక్షణమే బెషారతుగా బెయిల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లగచర్ల భూబాధితులను తమ సొంత వాహనంలో వారి స్వగ్రామం పులిచెర్లకుంట తండా, రోటిబండ తండకు తరలించారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు వినోద్ నాయక్, నరసింహ నాయక్, అడ్వకేట్ గోపి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ఆర్ సి జిల్లా అధ్యక్షులుగా మాల్వేకర్ ధర్మేందర్.

## - నియామక ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 20:**

జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ఆర్ సి) నేషనల్ చైర్మన్ స్వప్న ఆదేశాల మేరకు జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక ఉద్యమకారులు మాల్వేకర్ ధర్మేందర్ ను జిల్లా అధ్యక్షులుగా నియమిస్తూ, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య మాట్లాడుతూ, ప్రజలు తమ హక్కులు, విధుల పట్ల తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పనిచేయాలని, పూర్తి స్థాయి జిల్లా కమిటీతో పాటు నిజామాబాద్ జిల్లాలోని అన్ని మండల కమిటీల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. అవినీతి అక్రమాలకు తావులేని సమాజం కోసం కృషి చేయాలని మేధావులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. నూతనంగా నియామకమైన జిల్లా కమిటీ అధ్యక్షులు మాల్వేకర్ ధర్మేందర్ మాట్లాడుతూ, మా నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాజయ్య, పాటి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఇంజం సాంబశివరావు, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ పాముల నారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు పృథ్వీరాజ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. అవినీతి అక్రమాలకు తావులేని సమాజం కోసం మాకిచ్చిన బాధ్యతలను సక్రమంగా నీతి, నిజాయితీతో నిర్వహిస్తు, రాష్ట్ర కమిటీ ఆదేశాలకు లోబడి పనిచేస్తామన్నారు.

# కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి.

## - కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, డిసెంబర్ 20:**




వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఏఎన్ఎంలను రాత పరీక్ష లేకుండానే రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకురాలు లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైద్య, ఆరోగ్య సంఘాల పోరాట రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఏఎన్ఎంలు చేపట్టిన 48 గంటల ఆందోళనలో భాగంగా నిరసన తెలుపడం జరిగిందన్నారు. వైద్యారోగ్య శాఖలో కాం ట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు 24 ఏళ్ల నుంచి రెగ్యులర్ కాకపోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సమ్మె సందర్భంగా ఏఎన్ ఎంల న్యాయమైన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆ కమిటీ రిపోర్ట్ లేకుండా రాత పరీక్ష తేదీ ప్రకటించడం వెనుకాల ఉన్న అంతర్యమేంటని ప్రశ్నించారు. రాత పరీక్షను వాయిదా వేయకపోతే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కాగా, శిబిరంలోనే రాత్రి నిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో రేణుక, సవిత, లక్ష్మి, ఆర్సియా, దీవెన, స్వరూప, మౌనిక, కవిత, సంధ్యారాణి, రజిత పాల్గొన్నారు.

# తెలంగాణ భవన్ వద్ద భారీగా మోహరించిన పోలీసులు

హైదరాబాద్: తెలంగాణ భవన్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఫార్ములా ఈ–కార్ రేసులో ఏసీబీ కేసు నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అధికారులు భద్రత ఏర్పాటు చేశారు. కాగా, కాంగ్రెస్ సర్కార్ కుటిల ప్రయత్నంతో ఫార్ములా ఈ–కార్ రేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుపై కేసు నమోదైంది. ఈ–కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్లు దుర్వినియోగం చేశారనే అభియోగంతో కేటీఆర్‌పై ఎంఏయూడీ సెక్రటరీ దానకిశోర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై ఇప్పటికే పథకం ప్రకారం గవర్నర్ అనుమతి సైతం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఐఏఎస్ దానకిశోర్‌తో ఫిర్యాదు చేయించి, అరెస్టు చేసేందుకు కుట్రలు పన్నిందని బీఆర్ఎస్ శ్రేణులు విమర్శిస్తున్నాయి. గవర్నర్ నుంచి అనుమతి లభించిన వెంటనే ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని మంగళవారం సీఎస్ శాంతికుమారి ఏసీబీకి లేఖ రాశారు.

వేగుచుక్క

# “అయ్యప్ప దీక్ష”తో మానవ జన్మ పరిపూర్ణం.

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ వెల్లడి.**

**దైవ భక్తిలో దేశభక్తిని చాటుకున్న మహాపడి పూజ.**












**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 20:**

“అయ్యప్ప దీక్ష” తో మానవ జన్మ పరిపూర్ణం అవుతుందని అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ గుప్త అన్నారు. వినాయక్ నగర్ లోని రిలయన్స్ మాల్ ఎదురుగ గల కిసాన్ హైట్స్ లో శుక్రవారం ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త ఆధ్వర్యంలో బిక్ష మరియు అయ్యప్ప మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. ధన్ పాల్ వినయ్ కుమార్ స్వామి చేతుల మీదుగా బ్రహ్మ శ్రీ బల్యపల్లి సుబ్బారావు గురు స్వామి అంగరంగ వైభవంగా మహాపడి పూజ, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ మాట్లాడుతూ, హిందూ ధర్మంలో భాగంగా వ్యక్తి యొక్క నడవడిక, మానవ జీవన విధానం భక్తి మార్గంలో నడవడానికి అయ్యప్ప దీక్ష ఎంతో దోహదపడుతుందని అన్నారు. ప్రతి మనిషి తన జీవితంలో అయ్యప్ప దీక్ష తీసుకోవడంతో మానవ జన్మ పరిపూర్ణం అవుతుందని అన్నారు. తమ కుటుంబం నుండి గత ఇరవై ఏళ్లుగా అయ్యప్ప దీక్ష తీసుకోవడం ఆనవాయితీగా వస్తుందని, అది తాము చేసుకున్న పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. అయ్యప్ప స్వాములు దీక్ష తీసుకున్న నాటి నుండి కఠినమైన నియమ నిష్టలతో దైవ ఆరాధనలో ఎలాగైతే ఉంటారో దీక్ష అనంతరం కూడా హిందూ ధర్మం రక్షణకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. భక్తిలో కూడా దేశ భక్తిని చాటే చెప్పే విదంగా మణికంఠునికి త్రివర్ణ పథకం రంగులతో అభిషేకం నిర్వహించడం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు వేల సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్ధ ప్రసాదాలు స్వీకరించడం జరిగింది.

## శాస్త్రీయ దృక్పథంతో చదువులు, పరిశోధనలు ఉండాలి.




**ఓయు ఆర్ట్స్ కాలేజ్ వైస్ ప్రిన్స్ పాల్ డాక్టర్ భీనవేణి రామ్ షపర్డ్.**

**సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ డైరెక్టర్ గా నియమితులైన రామ్ షపర్డ్ కు పరిశోధక విద్యార్థుల శుభాకాంక్షలు.**

**వేగుచుక్క న్యూస్, హైదారాబాద్, డిసెంబర్ 20:**

శాస్త్రీయ దృక్పథంతో విద్యార్థుల చదువులు, పరిశోధనలు ఉండాలని, అప్పుడే దేశం అభివృద్ధి సాధ్యం అవుతుందని ఉస్మానియా యూనివర్శిటీ ఆర్ట్స్ కాలేజ్ వైస్ ప్రిన్స్ పాల్, సోషియాలజీ బీఓఎస్(బోర్డ్ ఆఫ్ స్టడీస్) డాక్టర్ భీనవేణి రామ్ షపర్డ్ అన్నారు. సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ డైరెక్టర్ గా నియమితులైన సందర్భంగా డాక్టర్ భీనవేణి రామ్ షపర్డ్ కు పరిశోధక విద్యార్థులు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రొఫెసర్ రామ్ షపర్డ్ మాట్లాడుతూ, సమాజ అభివృద్ధి కావాలంటే మంచి పరిశోధనలు జరగాలని అన్నారు. విద్యార్థులు మంచి పరిశోధనలు చేయాలి, తనని తాను మెరుగుపరుచుకుంటు సామాజిక బాధ్యతను నెరవేరుస్తూ శాస్త్రీయ దృక్పథంతో చదువులు, పరిశోధనలు కొనసాగించాలని అన్నారు. గ్రామీణ నేపథ్యంతో వస్తున్న మొదటి తరం విద్యార్థులు కేవలం ఉద్యోగ అవకాశాలే చూడకుండా ఎంటర్ ప్యునర్ షిప్, లక్షణాలు అలవర్చుకోవాలని, ఉపాధి కల్పన ఇతరులకి అందించేలా ఉండాలని అన్నారు. మహాత్మ పూలే అంబెద్కర్ సామాజిక న్యాయంను, మార్క్స్, గ్రాంసిల ఆర్థిక విశ్లేషణలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తూ, ప్రజా కేంద్రక రాజకీయాలను, పాలసీలాగా రూపొందించాల్సిన బాధ్యతను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పరందాములు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు, సోషియాలజీ పరిశోధక విద్యార్థి ఆర్ఎల్ మూర్తి, టిపిటిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ విజయ్, హైదరాబాద్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అశోక్, నాగేందర్, విజేయ్, మణి, దినేష్, సిరాజ్, అజయ్, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## శాంతి,ప్రేమ గొప్ప లక్షణాలు ఎప్పటికి అనుసరణీయం.

**నూడ చైర్మెన్ కేశ వేణు. ప్రెస్ క్లబ్ లో సపోజ్ క్రిస్మస్ వేడుకలు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 20:**




ఏసు ప్రభువు బోధనలు, ఆయన చూపిన శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వం, సహనమనే గొప్ప లక్షణాలు ఎప్పటికీ అనుసరణీయమని నిజామాబాద్ నుడా చైర్మన్ కేశ వేణు అన్నారు. శుక్రవారం నగరంలోని నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సపోజ్ క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేశ వేణు మాట్లాడుతూ, క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, సౌభ్రాతృత్వం, కరుణ, క్షమాగుణం నేర్పే క్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆచరణీయమని తెలిపారు. రాష్ట్రంలో సెక్యులర్(మత సంబంధం లేని) ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. మతసామరస్యాన్ని కాపాడుకుంటూ, పరిపాలన పారదర్శకంగా, ప్రజాస్వామికంగా తెలంగాణ రాష్ట్రంలో సాగుతుందని పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అంతడుపుల రామకృష్ణ, బైర శేఖర్ మాట్లాడుతూ, కుల, మతాలకతీతంగా అన్ని పండగలను ప్రతి సంవత్సరం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆనవాయితీగా నిర్వహిస్తున్నామన్నారు. నిజామాబ్బాద్ సిఎస్ఐ పాస్టర్ రెవరెండ్ ప్రకాష్, తెలంగాణ యునైటెడ్ పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు జకర్యా ఆనంద్, ప్రధాన కార్యదర్శి డానియల్, కోశాధికారి జాన్ బనియన్, సపోజ్ క్రిస్మస్ వేడుకల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి సందీప్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరాల రత్నాకర్, నగర జర్నలిస్టులు సదానంద్, రవి, రాజేశ్వర్, రాజ్ కుమార్, రాజు, జైపాల్, జాక్సన్, ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

